# దొరసాని

ఆ ఊరు పక్కమ్మటి పాడుబడ్డ దేవాలయం. దానికి కొంత దూరంలో వరుసగా మూడు గదులున్న పెంకుటిల్లు. మధ్య గదినే ముందుకు పెంకులతో పొడిగించబడ్డ వరండా. వాకిట్లో ఒక వేప చెట్టు. మూడు వైపులా కాంపౌండ్ గోడ.

వరండాలో వాలుకుర్చీలో రామయ్య పంతులు, పక్కన భార్య సీతమ్మ. భర్త ఉత్తరాన్ని చదువుతూ ఉంటే వింటూ మధ్య మధ్యన బరువుగా నిట్టూరుస్తూ వుంది.

"మమ్మలిని ఇంతవరకు చదివించారు చాలు, మా పెళ్ళిళ్ళ గురించి బాధపడకండి" ఈ వాక్యంతో చదువుతున్న రామయ్య కళ్ళలోనూ, వింటున్న సీతమ్మ కళ్ళలోను నీళ్ళు తిరిగాయి.

"ఓ ప్రైవేట్ స్కూల్లో చిన్న ఉద్యోగం దొరికింది. మరో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూ "

- మీ కూతురు

మానస

ఉత్తరం మడిచి పక్కన పెట్టి రెండు చేతులను తలకింద పెట్టుకొని వాసాల వైపు చూస్తున్నాడు.

"ఉన్న ఆస్థి చదువులకే ఊడ్చుకుపాయె. పై చదువులు వద్దంటే విన్రైతిరి" అంటూ బాగా అరిగిపోయిన కాలి మట్టెలను అటు యిటు తిప్పుతూ వేళ్ళకు పడ్డ గంట్లను రాస్తూ అన్నది.

"జరగాల్సినదాని గురించి చెప్పు "

" పంతులమ్మ గారు, ఓ పంతులమ్మ గారు "అంటూ దర్వాజా దాటి లోనికి వచ్చి ఓ ఆనపకాయను మొగరానికి ఆనించి -

"మా పందిరి మీద కాసింది " రైతు కూలీ వెంకన్న

"నీ పేరు వెంకడు కదా ! చూడు పటేలును అడిగి కొబ్బరికాయలు కోసుకొచ్చి ఇచ్చిపో. రేపు శనివారం కదా "అంటూ కుర్చీలో ఒరుగుతున్నప్పుడు ఎంతో వాత్సల్యంలాంటి కదలిక. వెంకన్న సరే అన్నట్టు తల వూపుతూ బయటికి నడిచాడు.

"చూశావా ఈ పంతులు గారిని ఎవరూ పస్తులు పండనివ్వరు "బుజంమీది జంధ్యాన్ని చేతులతో జరుపుకుంటూ అన్నాడు.

"ఇదేమన్నా కొత్తా " అంటూ సొరకాయతో నడిచింది. రామచంద్రా అంటూ కుర్చీలో ఒరిగి కాసేపు కళ్ళు మూసుకున్నాడు. అరవై ఏళ్ళ జీవితాన్ని అద్దంలో చూసుకున్నట్టు

గతం కళ్ళముందుకొచ్చింది.

వెనకట ఏ ఊరి బ్రాహ్మలు ఆ ఊరిలో పంచాంగాన్ని అనుసరించి తిథి - నక్షత్రాలు అనుసరించి తద్దినాలు, భూమి పూజలు నిర్ణయించేవాళ్ళు. రోజుకు ఒకటి వచ్చేటట్లు సర్దుబాటు చేసికోవడం వల్ల తిండి, బట్టకు లోటుండేది కాదు. ఇండ్లలో పెళ్ళిళ్ళు అయితే ఏది అడిగినా తెచ్చిపెట్టేవాళ్ళు. ఇప్పుడు పట్టణాలకు పెళ్ళి సామాన్లకు వెళ్ళినప్పుడు అక్కడే లగ్న నిర్ణయం. అన్ని లగ్గాలు ఒక్కరోజే ఫంక్షన్ హాళ్ళలో ! ఒకటడిగితే ఒకటుండదు. ఆ పూటే పెళ్ళి, ఆ పూటే విందు, మరో గంటకు హాలు ఖాళీ. ఇక తద్దినాల మాట దాదాపు మరిచిపోయినట్టే. పోతే భూమి పూజలు మేస్త్రీ ఒక కొబ్బరికాయ కొట్టేస్తే చాలు. ఏం కాలమొచ్చెరా నాయనా ! ఇంకా ఎలాంటి కాలం రానున్నదో!!

* * *

రామయ్య పంతులు భోజనం ముందు కూర్చుంటూ "చూడు, మన కష్టాలు గట్టెక్కినట్టే, చిన్నోనికి స్టేట్ ఎక్సైజ్ ఉద్యోగం, చిన్నదానికి కమర్షియల్ టాక్స్‌లో ఉద్యోగం. తాను ఎం. ఏ చేస్తుందట. అమ్మాయి ఉత్తరంలో రాసింది "అని ముద్దను నోట్లో పెట్టుకున్నాడు. ఉత్తరంతో పాటు పంపిన ఫోటోనే చూస్తూ కూర్చున్న తల్లి "చాలా లావైంది బిడ్డ. ఆ పెద్ద కళ్ళు, పొడవైన జడ, తెల్లని పలువరుస, అచ్చం నేను వయసులో ఉన్నప్పుడు ఉన్నట్టే ఉంది కదండి "అంటూ ఫోటోను ముద్దు పెట్టుకుంది.

* * *

ఆ తరువాత రామయ్య పంతులు ఇంటికి పోస్ట్‌మెన్ రాకపోకలు పెరిగాయి. ఇంట్లో టి.వి, బయట లూనా, డెకోలం మంచాలు, వెండి కంచాలు. ఊరంతా రామయ్య పంతులుకు పట్టిన అదృష్టాన్ని గురించి చెప్పుకోవడం మొదలుపెట్టారు. ఇంటి కళే మారింది. ఇంతకు ముందు 'ఓ బాపనాయనా' అని పిలిచిన వాళ్ళే నాలిక కరుచుకొని 'పంతులు గారూ ' అని పిలుస్తున్నారు.

ఉద్యోగం చేసే అమ్మాయికి పెళ్ళిచూపులొస్తే పెద్దమ్మాయికి పెళ్ళి అవ్వాలంటున్నారు. పెద్దమ్మాయి సిటీకెళ్ళి నాలుగేండ్లు కావస్తున్నది. ఒక్కసారి కూడా ఆమె ఇంటికి రాలేదు. ఎవరినీ సిటీకి రమ్మనలేదు. అక్కడే కూర్చుని అన్నీ నడిపిస్తూ ఉంది.

* * *

నగరంలో -

"ఈ రోజు మనం డా॥ బి. ఆర్. అంబేద్కర్ గారి జయంతోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సభకు అధ్యక్షత వహించవలసిందిగా మన జిల్లా కలెక్టర్ బి.యన్.కె. రావు గారిని కోరుతూ, వారు అధ్యక్ష స్థానాన్ని అలంకరించవలసిందిగా మనవి "

కరతాళ ధ్వనుల మధ్య కలెక్టర్ గారు వేదికనధిష్ఠించగా, వారి మెడలో పూలమాల.

"ఈనాటి ఈ సభకు ముఖ్య అతిథిగా శ్రీమతి కలెక్టర్ గారిని తమ ప్రత్యేక స్థానంపై ఆసీనులు కావలసిందిగా ప్రార్థన"

శ్రీమతి కలెక్టరు గారు వేదికను అలంకరించగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించారు.

మొదట కలెక్టర్ గారి తొలి పలుకులు -

"పేదవాడు పైకి రావాలంటే అంబేద్కర్‌ను అనుసరించాలి. ఆయనలాగా కష్టపడి చదవాలి. చదువు బతుకును మారుస్తుంది. ఈ రోజు ఈ స్థాయిలో నేనున్నానంటే దీనికి కారణం చదువు ! చదువు !! చదువుకొని పైకొచ్చినాక మీ ఊరిని, మీ ఊరొచ్చిన పేదవాడలను మరచిపోకండి" కొందరు చప్పట్లు కొట్టారు. మరికొందరు ఏవో గుసగుసలు, అది గమనించిన కలెక్టర్ గారు తన ఉపన్యాసాన్ని ముగించి కూర్చున్నారు.

"తమరు మర్చినట్లే వుంది" జనంలో ఓ గొంతు. "ఇప్పుడు శ్రీమతి కలెక్టర్ గారు పేదలకు నూతన వస్త్రాలను పంచిపెడతారు" అంటూ మరో అధికారి లిస్టు చదువుతున్నాడు.

బట్టలు తీసుకోవడానికి తీసుకురాబడిన కుంటి, గుడ్డి, ముదుసలి వాళ్ళంతా పట్టణానికి చెందినవాళ్ళే. అధికారి పేర్లు చదువుతుండగ ఒక్కొక్కరే వచ్చి ఆడవాళ్ళు చీరెలను, మొగవాళ్ళు ధోతులను తీసుకున్నారు.

ఆ తరువాత "ఇప్పుడు శ్రీమతి కలెక్టర్ గారు తమ సందేశమిస్తారు" అని ప్రకటించాడు అధికారి.

జనం గోల ఎక్కువైంది, ఎవరూ దేనినీ వినిపించుకున్నట్టు లేదు.

"మన కలెక్టర్ గారు చదువు బ్రతుకును మార్చేస్తుంది అన్నారు. అది నిజం, స్వానుభవం కూడా. వారు అంబేద్కర్ లాగా ఎన్నో అవమానాలకు గురి అయ్యారు. పట్టుదలతో చదివి పేదరికాన్ని వదిలించుకున్నారు. ఒక్కరిద్దరు బాగుపడగానే పేదరికం పోయిందనలేము. అంతే కాదు, ఎవరూ కూర్చుని తినకూడదు"

"కూర్చుని తినేది ఎవరంటా ?" జనంలోనుండి ఓ కేక.

"అదే ఆలోచించవలసి ఉంది. అలాంటి వాళ్ళకు శ్రమించటం నేర్పవలసి ఉంది. అందుకోసం అందరం కృషి చేస్తేనే ఈ మార్పు జరుగుతుంది. జై భీమ్" అంటూ సభకు నమస్కరిస్తూ కూర్చుంది.

ఆ తరువాత జనగణమన -

కలెక్టర్ గారు కారువైపు నడిచారు. వెనకాల, "అమ్మగారు ఒక అలంకరించిన బ్యూటీపార్లర్, చెప్పుకోదగ్గదే. విగ్రహానికి తగ్గట్టు ఆమె వేషధారణ" అంటూ వెనకనే నడుస్తున్న ఒకడు "కాదు" అంటూ గుంపులోనుండి ఓ అజ్ఞాత గొంతు.

ఇద్దరు కారులో కూర్చోగానే కారు కదిలి రోడ్డెక్కింది.

"విన్నారు కదా, సూటిపోటి మాటలు " అంటూ కలెక్టర్ ముఖంలోనికి చూసింది మానస.

"కొత్తేం కాదు కదా "

"వీళ్ళెన్నడు బాగుపడతారో మానస "

" అందరు చదువుకున్ననాడు "

" ఏం చదువో ఏమో కానీ నేను కలెక్టర్ భార్యను కానట. విని ఊరుకున్నారే"

మౌనంగా మానస వైపు చూసాడు కలెక్టర్. అప్పుడు ఆమె ముఖం ఎరుపెక్కి అవమానంతో అతలాకుతలంగా కనిపించింది.

కాసేపు మౌనం తరువాత ఓ బరువైన శ్వాస వదిలి కర్చీఫ్‌తో నుదురును అద్దుకుంది.

"ఒకరి సొంత విషయాన్ని మరొకరు నలుగురిలో నవ్వులాటగా మాట్లాడొద్దన్న విషయం వీళ్ళింకెప్పుడు తెలుసుకుంటారో "

"మనం చెప్పగా, చెప్పగా "

"మరి కాలేజీల్లో ఏమి నేర్చుకుంటున్నట్టు ? "

"రొట్టె, బట్టా ఎలా సంపాదించుకోవాలన్న విషయం "

వీళ్ళ సంభాషణ వింటూ డ్రైవరు కారు నెమ్మదిగా నడుపుతున్నాడు.

"మీరు వాళ్ళనే సపోర్టు చేస్తున్నట్టు వుంది "అంటూ కలెక్టర్ కళ్ళలోకి చూసింది. అప్పుడామె నిష్కారం కదలికలో జాణతనం కనిపించగానే రావుగారి చూపులు మానస మీద ఆగాయి.

కారు కలెక్టర్ బంగళా ముందు ఆపి, డ్రైవర్ డోర్ తెరవగానే దిగి ఇంట్లోకి నడిచారు. పనివాళ్ళు బయటికి నడిచారు. అప్పటివరకు లైట్లు మాత్రమే వెలుగుతున్న ఇంట్లో ఫ్యాన్లు కూడా తిరగసాగాయి. గదిలో నిలువుటద్దం ముందు నిల్చుని రావు గారు కోటు బటన్ తీయగానే, వెనకనుండి వచ్చిన మానస కోటునందుకొని, హాంగర్‌కు వేసి, ముందుకొచ్చి నిల్చుని టై ముడి విప్పసాగింది. అప్పుడు రావుగారు రెప్పవాల్చకుండా అద్దం వైపే చూస్తున్నారు.

"ఏమిటలా చూస్తున్నారు" అంది షర్ట్ బటన్స్ విప్పుతూ.

ఆఫీసు గదిలో టెలిఫోన్ మోగింది. రావుగారు ఫోన్‌వైపు నడిచారు. మానస అల్మరావైపు నడిచి నైటీని తీసుకుంది.

* * *

తిరుమలేశుని దర్శనానికి వేలమంది క్యూలో నిలుచున్నారు. అధికారులెదురొచ్చి

రామయ్య పంతులును, సీతమ్మను ప్రత్యేక మార్గం గుండా గర్భగుడిలోకి తీసుకువెళ్ళి దర్శనం గావించి శేషవస్త్రాలను బహుకరించి, తీర్థప్రసాదాలను ఇప్పించి, ఓ కాటేజిలో బస ఏర్పాటు చేశారు.

"ఇది కలా, నిజమా !"

"కొంచెమాగండి" అంటూ భర్తను సమీపించి అతని భుజాన్ని గిల్లింది.

"వుండవే నిజమేను" అంటూ గిచ్చిన చోట చేత్తో రుద్దుకుంటూ తమను దిగబెట్టి కదిలిపోయే కారును చూస్తు నిలుచున్నాడు.

"ఇది ఎవరి పని అంటారు ? చిన్నోడు చేయించొచ్చా, లేక చిన్నదా ?"

"పెద్దదానిపనే. ఎం.ఏ సంస్కృతం ప్యాసైంది కదా, ఇక్కడే దేవస్థానంలో పెద్ద ఉద్యోగం దొరికిందేమో" అంటూ అప్పుడే వచ్చిన దేవస్థానం ఉద్యోగి వైపు మళ్ళి -

"నాయనా ఈ దేవస్థానంఅధికారి ఎవరు" అంటూ జంధ్యాన్ని ఓసారి లాగి మళ్ళీ బయటకునెట్టుతూ అడిగాడు. ట్రేలోని పాల గ్లాసులను టేబుల్ మీదుంచుతూ ఎందుకు అన్నట్టు చూసాడు.

"ఆఁ ఏ కులం వాడు అని" జంకుతూనే అడిగాడు.

"ఎస్సీ"

"అలాగా" అంటు విస్తుబోతుండగా

"ఏం - ఎస్సీ ఉండకూడదా ?" చూపుల్లో ఓ మాదిరి కసిని ఒలకబోస్తూ అడిగాడు.

"ఆఁ దానికేం, ఇప్పుడు వాళ్ళు కూడా అర్చకులుగా వున్నారు కదా"

"తమరెవరండి"

"ఎవరైతే ఏముంది. బ్రహ్మంగారు అన్నట్టు వర్ణసంకరం జరిగిపోతూనే వుంది, నీవెవరు నాయనా

"నేను యస్సీనే" అంటూ వెళ్ళిపోయాడు.

"ఏమండీ ఆ పాలను పారబొయ్యండి"

రెండు గ్లాసులను తీసుకెళ్ళి వాష్‌బేసిన్లో పోస్తూ "కృష్ణార్పణం" అన్నాడు.

"అవి అంటుబడ్డ పాలు, కృష్ణార్పణం అంటున్నారేమిటి ?"

"పాపం క్షమించు గాక, సర్వార్పితం" అన్నాడు చెంపలు వేసుకుంటూ

మరునాడు ఉదయం దేవస్థాన ఉన్నత ఉద్యోగి వచ్చి -

"తమరు రామయ్య గారే కదా"

"చిత్తం" అంటూ చేతులు జోడించి నిల్చున్నాడు.

"ఇదిగో మీ ఊరి దేవాలయానికి మూడు లక్షల రూపాయలను దేవస్థానంవారు మంజూరు చేశారు. మీరు మీ ఊరెళ్ళి ఓ కమిటీని వేసి, ఆ కమిటీ ద్వారా ఈ గ్రాంటును ఖర్చు చేయించండి" అన్నాడు ఆ ఉద్యోగి.

ఏమిటో అర్థంకాని చూపులతో వినయంగా ఆ కాగితాన్ని అందుకున్నాడు.

"పోతే మీ దంపతులకు నూతన వస్త్రాలు" అంటూ రెండు పెట్టెలను అందించాడు. ఈ సారి నోరు తెరచి కళ్ళప్పగించి చూస్తూ -

"అమ్మా ఇదంతా ఎవరి దయ" అని అడిగాడు.

"అంతా వెంకన్న దయ. ఇక మాకు సెలవు ఇప్పించండి. కారు సిద్ధంగా వుంది, వెళ్ళిరండి, ఉంటాం" అంటూ వెళ్ళిపోయాడు.

దంపతులు గుడివైపు చేతులు జోడించి కాసేపు నిలుచొని ఆ తరువాత కారులో కూర్చున్నారు.

కారు కదిలింది.

* * *

అది మరో ఊరు. వచ్చేపోయే బస్సులు ఆగే చావడిఅది. ఆ పక్కనే వున్న పేటకు వెళ్ళటానికి నలుగురైదుగురు నిల్చున్నారు. వాళ్ళలో మోతుబరి రైతు చంద్రా రెడ్డి, పెద్దగౌడ్ బాలయ్య, ఊళ్ళోని హరిజనవాడవైపు నుండి వస్తున్న జీపును ఆపాలని చేయి ఊపాడు చంద్రారెడ్డి. అది ఆగకుండా దుమ్ములేపుతూ వెళ్ళిపోయింది.

"ఎక్కడిదీ జీపు" రెడ్డి

"చదువు వెలుగని రాసి వుంది" గౌడ్

"అట్టనా హరిజనవాడనుండివస్తుంటే మన నాగయ్యకొడుకు పోతుండేమో అనుకున్న"

"ఎవరు కొండయ్య, ఆయనెందుకొస్తడు, రాక ఎన్నేండ్లాయె"

"ఆయన కలెక్టరైండని ఎంత మురిసినం, ఈ ఊరును బాగు చేస్తాడని, తల్లితండ్రులను సుఖపెడతాడని" రెడ్డి.

"ఊరు బాగు సేయకుంటే మాయె. తల్లితండ్రులకు కష్టం తప్పదాయె. ఇంకా కూలి బతుకే. అదే పూరిల్లు, అదే తాటాకుల పందిరి"

"అవును మొదట ఏమీలేనప్పుడు మేనపిల్లను చేసుకొనె. ఇన్నో అన్నో ఇస్తే ఆటిని ఖర్చుపెట్టి నౌకరీ సంపాయించె. ఇప్పుడేమో దానికి చదువు రాదు, నల్లగుంది, మోటు

ముండ అంటున్నాడట ''

"స్వంత చెల్లె పిల్లలతో పాటు పోతే మాట్లాడనేలేదట. ఓసారి అన్నపోతే బర్లను ఇప్పిస్తే అమ్ముకుంటివి, కోళ్ళనిప్పిస్తే చావకొడితివి, ఏం చేసి బతుకుతవు అన్నాడట. తమ్ముణ్ణేమో కాలేజీలో చేర్పించి, హాస్టల్లో ఉండమన్నాడట " రెడ్డి.

"ఇంకా ఈ సంగతి తెలవదేమో. తల్లితండ్రి వెళ్ళి కోడలిని నీ వెంట వుంచుకొని మాకింత పంపితే పూట గడుసుద్దని అంటే అసలు మీరెందుకొచ్చింద్రని ఆ రాత్రి ఎక్కన్నో ఉంచి మరునాడు పంపిండట " అప్పటివరకు ఆ సంభాషణ విన్న మరో పెద్దమనిషి.

"నాగయ్య కొడుకు సంగతా మాట్లాడేది " దారంతో కట్టిన కళ్ళద్దాల నుండి చూస్తూ అడిగాడు.

అవునన్నట్టు ఇద్దరూ తలాడించారు.

" పేరు గూడ మార్చుకుండట. మొన్న మామను పిలిచి, నీ బిడ్డకు విడాకులివ్వాలి అనుకుంటున్న ఎంత కావాలి అన్నాడట. భోరున ఏడుస్తూ వద్దు తండ్రీ, సచ్చినా, బతికినా నీ దగ్గరే పడివుంటది. ముద్దపెట్టు చాలు అంటు కాళ్ళు పట్టుకున్నా కాదంటే కాదన్నాడట పెద్దమనిషి "

"కుటుంబమంతా కూలి చేసి, పండగలు మాని, పస్తులుండి సదివిస్తే ఆఫీసర్ అయినంక ఆడు చేసే పని ఇదా ? " రెడ్డి.

"నీకు ఇంత పెద్ద నౌకరొచ్చింది యిగ మా పేదరికం పోతుందనుకున్నం అని అంటే -

ఒక్కసారె ఎవ్వరి పేదరికం పోదన్నాడట.

నా బిడ్డను కాదని మరొకరితో సంసారం చేయటంఅన్యాయం అంటే -

నీ బిడ్డకు డబ్బు పంపుతూనే వున్న కదా, ఏమాత్రం గోల చేసినా అదీ బందు అవుద్ది అని పంపించినాడంట "

" ఎక్కువ చదివించటం నాదే బుద్ధి తక్కువ "

"మీరేమనుకుంటున్నారు "

"మరి నీవు చేసిన పనేమిటి ? "

"మరో మార్గం కనిపించలేదు "

"అంటే

"మన పస్తులు పోవాలి, తమ్మునికి, చెల్లెకు ఉద్యోగం రావాలి "

"ఉద్యోగమే వచ్చింది చూశా. కాని ఇప్పుడు దాన్ని ఎవరు చేసుకుంటారు "

"మరో ఆఫీసర్ "

"ఆఫీసర్‌కు ఎంత కట్నం కావాలనుకుంటున్నావ్ "

"నేను చూసుకుంటాను కదా "

"అంటే దాన్ని నీలాగే "

"కాదు, తగిన వరుణ్ణి చూసి పెళ్ళి చేస్తాను. "

"చేస్తావు, చేస్తావు, యస్సీ కల్లెక్టర్ బంధువులుగా వీళ్ళు యస్సీలని సర్టిఫికెట్ కూడా తీస్తావు "

ఈ సంభాషణ జరిగినంత సేపు ఒకరిముఖం ఒకరు చూసుకోకుండా వెనుతిరిగి నిల్చున్నారు.

"మన ఆర్థిక నేపథ్యం గురించి కూడా ఆలోచించవలసి వుంది "

"అయితే ముందు మా చావు చేయించు "

"నాన్నా " - ఒకేసారి ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. కల్లెక్టర్ బంగళాముందు లాన్‌లో ఈ సంభాషణ.

"లోనికి పదండి " అంటూ అనుకోకుండా తన్నుకొచ్చిన కన్నీరును తుడుచుకుంటూ, తండ్రి చేతులు పట్టుకుంది. రామయ్య మౌనంగా కదలకుండా నాటిన విగ్రహంలా నిల్చున్నాడు. ముక్కుపుటాలు రోషంగా కదులుతున్నాయి. నుదుటి విభూది తడిసిపోతుంది.

"కాలాన్ని బట్టి పట్టువిడుపులు వుండాలి నాన్నా "

"నా కడుపున పుట్టి, నాకే పాఠాలు నేర్పుతున్నావు " కోపంతో పెదాలు వణుకుతున్నాయి.

"అంతమాట అనకు నాన్నా, మనసు మార్చుకుంటే బాగుంటుంది అంటున్నా "

"వేదపారయణుడు, నిష్టాగరిష్టుడైన ఈ రామయ్య పంతులు రేపు ఛండాలునికి పుట్టే సంతానాన్ని తన ఎదమీద ఎత్తుకొని తిరగాలి, వేలుబట్టి నడక నేర్పాలి అంతే కదా "అన్నప్పుడు ఆయన కళ్ళు మరీ ఎరుపెక్కాయి.

"మరో జన్మంటూ వుంటే కడజాతిలోనే జన్మిస్తాను అన్న మహాత్ముని మాటలు మీరు చదవలేదా? "

"అవన్నీ రాజకీయ ఉపన్యాసాలు. వశిష్ట వంశానికి చెందిన ఈ సీతారామయ్య పంచములతో బతుకు పంచుకోవడమా "

"మరి వశిష్టుడు - అరుంధతీ సంబంధం "

"అవి కట్టు కథలు "

"భారతం కట్టుకథేనా "

"సంస్కృతం చదవటం వల్ల నీకు తెలివి ఎక్కువైంది "

"మీరే కదా నాన్న, మానస నన్ను మించిన పండితురాలవులవుతుందని, నా చిన్నప్పుడు తర్కం విని "

"అదే ఇప్పుడు నా కొంపకు చేటు తెచ్చింది "

"ఇంతకీ అమ్మ బాగుందా నాన్నా "

"ఏడుస్తుంది, ఈ కులం కాని కూడు కన్నా పస్తులే మేలంటుంది. ఊరు కోడై కూస్తుంటే ఎలా తలెత్తుకు తిరగాలి " ఇద్దరి మధ్యా కొన్ని క్షణాలు మౌనం.

"ప్రస్తుతానికి ఊరొదిలి అమ్మ చెల్లె దగ్గర, మీరు తమ్ముని దగ్గర ఉండండి. మిగతా విషయాలు తరువాత ఆలోచిద్దాం "

"ఆలోచించింది చాలు " అంటు వెనుదిరిగి నడుస్తూ జారిన భుజం మీది జరీ అంచు శాలువను సరిచేసుకున్నాడు.

"నాన్న గారు, నాన్న గారు, "

తిరిగి చూడలేదు, ఆగి మాట్లాడలేదు.

లాన్‌లో నీళ్ళు పట్టిస్తున్న మాలి వెళ్ళి ఆపుదామనుకున్నాడు, కానీ ఎందుకో ఆపలేకపోయాడు. పెండ్లి కాని పిల్ల పెండ్లి అయినవాడితో తిరుగుతుంటే ఇన్నాళ్ళు ఏం చేసిండో ? అని తనలో తాను అనుకున్నాడు. కనబడకుండా పోయేంతవరకు తండ్రి వైపే చూస్తున్న మానస చూపులు ఎదురుగ ఉన్న పూల చెట్ల మీద ఆగినయి.

మొన్నటి వరకు చెట్లనిండా కనిపించిన పూలు ఈ రోజు లేవు ! తనలో కలిగిన సంచలనాన్ని అణుచుకోవడానికి మానస లాన్ నుండి గేటువైపు నడుస్తూ వుంది. గేటు దగ్గర గ్రామీణులిద్దరు కలెక్టర్ గారి కోసం నిల్చునట్టుంది. మానస గేటును సమీపించి మూసి ఉన్న గేటు మీద చేతులుంచి, వాళ్ళను పరిశీలనగా చూడసాగింది.

ఆ దుమ్ము కొట్టిన పాదాలు ఏ ఏ కోరికలను గమ్యాన్ని చేర్చాలని మోసుకొస్తున్నాయో ! ఆ బిక్కు బిక్కుమనే చూపులు ఏ ఆశల్ని దాచుకొస్తున్నాయో కలెక్టర్ గారుంటే బాగుండు!

అరవై ఏండ్ల పల్లెవాసి, తలపాగ, చెవికి వేలాడుతున్న పోగు, సరిగ్గా ఆయన వయసులో సగం ఉన్న స్త్రీ మెడలో పసుపుతాడు, చేతులకు మామూలు గాజులు, రంగు వెలసిన నూలు చీర. ముఖాన నయాపైసంత కుంకుమ బొట్టు, తెల్లని పలువరుస, ఎండవానల్లో రంగు మారిన ఓ మాదిరి శరీర ఛాయ.

" ఏం కావాలి ? "

"కలెక్టరయ్యగారిని కలవాలి "

"దరఖాస్తు ఏమన్నా తెచ్చారా, దొర ఊళ్ళో లేరు "

" ఎప్పుడొస్తాడు "

" రెండు రోజుల తరువాత "

"తమరు "

"ఇక్కడే పని చేస్తుంటాను చెప్పండి "

"అయితే ఇది అది కాదన్న మాట "అనుకుంటూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

" ఏమీ లేదు. ఒక మాట అడుగుదామని వచ్చినం "

"నేను ఆయన మేనమామను" ఆ మాట విన్న మానస మనసు కలుక్కుమంది

"బహుశా ఈవిడ ఈమే అయి వుంటుంది, విన్న పోలికలు కలుస్తున్నయి "

" లోపలికి రండి మాట్లాడుదాం"

"లోపలికి వస్తే ఏముంది - అసలోళ్ళు లేంది "

" నా సమితి కనిపిస్తే జుట్టు బట్టి కొట్టిపోదు "అంటూ కోపంతో ఊగిపోయింది.

ఈసారి మానసకు ఒళ్ళు జల్లుమంది. ఆయన లేందే మంచిదైంది అనుకుంది

"ఆమె కూడా ఎమ్మటే పోద్దా అమ్మా" అని అడిగాడు.

"ఉంచుకున్నదే ఊరేగేటందుకాయె" కళ్ళలో కసి, పలకటంలో ఏవగింపు కొట్టొచ్చినట్టు కనిపించయి.

మానస మౌనంగా చూస్తూ నిలుచుంది. ఎడమ చేతికి కాల చక్రం, కుడి చేతికి బంగారు గాజులు, ఎదలో ఏముందో కనబడకుండ మెడ నిండా కప్పుకున్న కొంగు.

ఆ తరువాత వాళ్ళు రోడ్డు వైపు, మానస బంగ్లాలోకి నడిచారు. బి. యన్. కె. రావు *I. A. S* గేటు పిల్లరుకు వేలాడుతున్నాడు.

తరతరాల తర్వాత వచ్చిన అవకాశం అందవలసిన వాళ్ళకు అందకుండా పోతుంది, చెందవలసిన వాళ్ళకు చెందకుండా పోతుంది అనుకుంటూ మాలి ఎండుటాకులను ఏరుతూ ఉన్నాడు.

జూన్ 1993 •